సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 5 । జనవరి । 2025



ఆర్‌డీ వైరస్‌తో కోళ్లు మృతి

ఆర్‌డీ వైరస్‌తో కోళ్లు మృతి చెందుతున్నాయని, గాలి మార్పుల వల్ల ఈ వ్యాధి వస్తుందని, జాగ్రత్త వహించాలని పశు సంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. 8లో ▸



వైభవంగా తిరువీధి సేవ

చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన స్వామివారి తిరు వీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. 8లో ▸



టెక్‌జైట్‌-25 పోస్టర్‌ ఆవిష్కరణ

ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు నూజివీడు ట్రిపుల్‌ ఐటీలో నిర్వహించనున్న టెక్‌ జైట్‌-25కు సంబంధించిన పోస్టర్‌ శనివారం ఆవిష్కరించారు. 8లో ▸

న్యూస్‌రీల్‌

గుంతలకు మోక్షం



మసీదు సెంటర్‌ నుంచి రోడ్డుకు ఏర్పడిన గుంతలను పూడ్చుతున్న దృశ్యం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెద్ద మసీదు నుంచి గుణ్ణం ఫంక్షన్‌ హాల్‌ రోడ్డు వరకు అడుగుకో గుంత...గజానికో గొయ్యి ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం **గుంతలు పూడ్చాలని**, అనంతరం శాశ్వత ప్రాతిపదికన **రోడ్డు నిర్మిం**చాలని డిమాండ్‌ చేస్తున్నారు. దీనిలో భాగంగా 'అడుగుకో గొయ్యి.. గజానికో గుంత' శీర్షికన సాక్షి దినపత్రికలో డిసెంబర్‌ 8న కథనం వెలువడింది. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి.. తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు నిర్ణయించారు. రెండురోజులుగా రహదారిలోని గోతులను, గుంతలను పూడ్చారు. మరమ్మతులతో సరిపెట్టకుండా పర్మినెంట్‌గా రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్గో సేవల్లో పశ్చిమకు రెండో స్థానం



తణుకులో కరపత్రాలను ఆవిష్కరించిన కార్గో కమర్షియల్‌ మేనేజర్‌ సుబ్బారావు

తణుకు అర్బన్‌: కార్గో డోర్‌ డెలివరీ సేవల్లో రాష్ట్రవ్యాప్తంగా పశ్చిమ గోదావరి జిల్లా 3,627 బుకింగ్స్‌తో రెండో స్థానంలో నిలిచినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో కమర్షియల్‌ మేనేజర్‌ ఎ.వెంకట సుబ్బారావు తెలిపారు. తణుకు ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్గో డోర్‌ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని నాలుగు డిపోల్లో 1,179 బుకింగ్స్‌తో తణుకు డిపో మొదటి స్థానంలో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో కార్గో డోర్‌ డెలివరీ సేవలను వినియోగదారులు ఆదరిస్తున్నారనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని చెప్పారు. తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్‌ తదితరులు మాట్లాడారు.

7 వరకు ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

భీమవరం(ప్రకాశం చౌక్‌): జిల్లాలో ఎస్సీ కుల గణనపై జనవరి 7 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని కలెక్టర్‌ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎస్సీ జనాభా, వివరాలు, ఆధార్‌ నంబరు, పుట్టిన తేదీ, వయసు, తదితర వివరాలపై సోషల్‌ ఆడిట్‌ నిర్వహిస్తున్నారు. అర్జీలు ఆన్‌లైన్‌ చేయడం, మార్పులు, చేర్పులు వివరాల వెరిఫికేషన్‌కు గడువు జనవరి 11 వరకూ పెంచామన్నారు. జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో జనవరి 17న ప్రకటిస్తామన్నారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వాటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబంధిత రెవిన్యూ అధికారికి నివేదిస్తారని తెలిపారు.

ఎయిర్‌ ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశంచౌక్‌) అగ్నిపథ్‌ స్కీమ్‌ ద్వారా ఇండియన్‌ ఎయిర్‌ ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత అన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 7న ఉదయం 11 గంటల నుంచి 27వ తేదీ రాత్రి 11 గంటల వరకు చేసుకోవచ్చన్నారు. భారత వైమానిక దళంలో సేవలందించాలనే ఆసక్తి ఉన్న యువత వెబ్‌సైట్‌ సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పింఛన్‌దారుల వెరిఫికేషన్‌

భీమవరం(ప్రకాశంచౌక్‌): జిల్లాలో జనవరి 6 నుంచి మంచానికి, వీల్‌చైర్‌ కి పరిమితమైన పింఛనుదారుల తనిఖీలు చేపట్టనున్నట్లు కలెక్టర్‌ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 1,510 మంది పెన్షనర్లు రూ.15,000 చొప్పున పింఛన్‌ అందుకుంటున్నారని, వీరందరూ మంచానికే పరిమితమై లేదా వీల్‌చైర్‌ కేటగిరిలో పింఛన్లు పొందుతున్నారని, వారి ఇంటి వద్దనే షెడ్యూల్‌ ప్రకారం జనవరి 6 నుంచి జనవరి 31 వరకు వెరిఫికేషన్‌ చేస్తామని తెలిపారు. తనిఖీ నిమిత్తం జిల్లాలో డివిజన్‌ ఒక్కొక్క టీం చొప్పున 3 టీంలను రాష్ట్ర స్థాయి నుంచి కేటాయించారన్నారు. ప్రతి టీంలో ఒక జనరల్‌ డాక్టర్‌, ఒక ఆర్థోపెడీషియన్‌, డీఏ ఉంటారని తెలిపారు.

కోడి పందేలకు సై

- ముందస్తు నివారణ చర్యలు శూన్యం
- బైండోవర్‌ కేసులపై దృష్టి సారించని పోలీసు యంత్రాంగం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా పందెం బరులు
- ఉండి, భీమవరం, ఉంగుటూరులో భారీ స్థాయిలో ఏర్పాటుకు సన్నాహాలు
- బరుల్లోనే మద్యం, పేకాటకు ప్రత్యేక శిబిరాలు
- ప్రజాప్రతినిధులతో నిర్వాహకుల మంతనాలు

గోదావరి జిల్లాల్లో సంక్రాంతి అంటే పందెం కోళ్లు కాళ్లు దువ్వుతాయి. పందెరాయుళ్లు కోళ్లను సిద్ధం చేయడంతో పాటు.. బరుల ఏర్పాటులో బిజీగా ఉంటారు. మరో వారం రోజుల్లో సంక్రాంతి మొదలుకానుంది. ఈ నేపథ్యంలో కోడి పందేలకు సర్వ సన్నద్ధమవుతోంది.



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరిలో భారీగా కోడిపందేల నిర్వహణకు బరులను ఖరారు చేస్తున్నారు. నియోజక వర్గాల వారీగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో బరులు ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. అయితే డిసెంబర్‌ నుంచే పోలీసులు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా బైండోవర్‌ కేసులు, కత్తుల స్వాధీనం, పందేల బరుల ధ్వంసం.. ఇలా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కోడిపందేలను పూర్తిగా వదిలేశారు. ఇంత వరకు రెండు జిల్లాల్లో పదుల సంఖ్యలో కూడా బైండోవర్‌ కేసులు నమోదు చేయలేదు.

పందెం బరులు పంచుకున్న కూటమి నేతలు

కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, కోత ముక్కతో పాటు పందేల బరుల వద్దే ప్రత్యేక మద్యం స్టాళ్ల ఏర్పాట్లు చేస్తుంటారు. మరోవైపు జనసేన, టీడీపీ నేతలు కోడిపందేల బరుల కోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సిండికేట్లుగా ఏర్పడ్డారు. ఒక పందెం బరి నుంచి మరో పందెం బరికి ఇబ్బంది లేకుండా ఐదు, పది గ్రామాల నుంచి పందెంరాయుళ్లు వచ్చేలా ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో పెద అమిరం, సీసలి, కొవ్వాడ అన్నవరం, గొల్లవానితిప్పలో భారీ ఎత్తున బరులు ఏర్పాటు చేయాలని నిర్ణయించి పందెం బరులను కూడా ప్రజాప్రతినిధులు పంచుకున్నారు. ఈ నాలుగు బరుల్లో లక్షలతో మొదలై రూ.కోట్ల వరకు కోడిపందేలు జరుగనున్నాయి.

మద్యం, జూదం అన్నీ అందుబాటులో..

కోడిపందేల బరుల వద్ద బారికేడ్ల ఏర్పాటు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, బౌన్సర్లను ఏర్పాటు చేసేలా నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. జూద క్రీడల కోసం ప్రత్యేక శిబిరం, అక్కడే మద్యం సేవించేలా అనధికారిక మద్యం కౌంటర్లను కూడా టీడీపీ నేతల కనుసన్నల్లో ఏర్పాటు చేస్తున్నారు. భీమవరం రూరల్‌, వీరవాసరం, పాలకొల్లు మండలం పూలపల్లి, యలమంచిలి మండలం కలగంపూడి, ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు, అత్తిలి మండలం అత్తిలి, తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం, వెంకట్రామన్నగూడెం, నర్సాపురం మండలంలో తూర్పుతాళ్లు, లక్ష్మణేశ్వరం, పెనుగొండ మండలంలోని సిద్ధాంతం, మార్టేరు, ఆలమూరు, ఉంగుటూరు మండలం భీమడోలు, నిడమర్రు, గణపవరం, పెదవేగి మండలం దుగ్గిరాల, ఏలూరు రూరల్‌ మండలంలో భారీగా బరుల ఏర్పాటుకు సన్నాహాలు చేసి పొలాలను బరులుగా మార్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, దేవులపల్లి, లక్కవరం, చింతలపూడి మండలంలోని చింతలపూడి, సీతానగరం, కామవరపుకోట మండలం కళ్లచెరువులో భారీ బరులు ఏర్పాటు చేస్తున్నట్టు స్థానికంగా కూటమి నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

గతంలో వందల్లో కేసులు

కోడి పందేలకు సంబంధించి గతంలో పోలీస్‌ యంత్రాంగం సీరియస్‌గా ఉండేది. ఏటా డిసెంబర్‌ 15 నుంచే కోడి కత్తుల తయారీదారులు, విక్రయదారులు, పందేల నిర్వాహకులు, పేకాట, గుండాట నిర్వాహకులు ఇలా అందరిపైనా బైండోవర్‌ కేసులు నమోదు చేసి వేల సంఖ్యలో కోడి కత్తులు స్వాధీనం చేసుకునేవారు. 2022లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 3783 బైండోవర్‌ కేసులు నమోదు చేసి 350 మందికి నోటీసులు జారీ చేశారు. 4,600 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. 2023లో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 1300కు పైగా బైండోవర్‌ కేసులు నమోదు చేసి 2,670 కత్తులు స్వాధీనం చేసుకుని 185 మందికి నోటీసులు జారీ చేశారు. ఇలా ఏటా బైండోవర్‌ కేసులు వందల్లో ఉండేవి. ఈ సారి మాత్రం



గెలుపే లక్ష్యంగా..



కానిస్టేబుళ్ల ఎంపిక పరుగు పరీక్షలో పాల్గొన్న మహిళా అభ్యర్థినులు

ఏలూరు టౌన్‌ : ఏపీ పోలీస్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో శనివారం మహిళా కానిస్టేబుళ్లకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి ఎస్పీ కొమ్మి ప్రతాప్‌ శివకిషోర్‌ గ్రౌండ్‌లోనే ఉంటూ స్వీయ పర్యవేక్షణ చేశారు. మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించడంతో పాటు పరీక్షలను దగ్గరుండి మరీ పరిశీలించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 489 మంది మహిళా అభ్యర్థులకు హాల్‌ టికెట్లు జారీ చేశారు. ఎంపిక పోటీలకు 277 మంది మాత్రమే హాజరుకాగా వారిలో 117 మంది ఎంపికైనట్లు ఎస్పీ చెప్పారు.



లాంగ్‌జంప్‌ చేస్తున్న అభ్యర్థిని



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ శివ కిషోర్‌

పోలీసు కాపలాతో పశు వధ

మాజీ మంత్రి కారుమూరి ఆగ్రహం

తణుకు అర్బన్‌: అనుమతులు లేకపోయినా పోలీసుల కాపలా మధ్య అక్రమ మార్గంలో నిర్వహిస్తున్న పశు వధకు కూటమి ప్రభుత్వం కొమ్ముకాస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేతలిలో లాహం ఫుడ్‌ ప్రొడక్ట్స్‌ సంస్థ నిర్వహిస్తున్న పశువధ ప్రాంత బాధిత మహిళలు రోడ్డెక్కి ఏడుస్తున్నా, కాళ్లు మొక్కుతామంటున్నా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రిటీష్‌ తరహా పాలనను గుర్తు తెచ్చేలా ఉద్యమంపై పోలీసులతో ఉక్కుపాదం మోపి నిరసనను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లేసిన ప్రజల కంటే మధ్యప్రదేశ్‌ నుంచి వచ్చిన పెత్తందారుకు కొమ్ముకాస్తున్నావంటే ఎంత మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయో ప్రజలు కూడా చర్చించుకుంటున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. శాంతియుతంగా నిరసన చేయనివ్వకుండా ఉద్యమాన్ని అణగదొక్కాలని చూస్తున్నారని, ప్రజల్లోంచి వస్తున్న పోరాటంలో కొట్టుకుపోతావంటూ హెచ్చరించారు. అనుమతులు ఉన్నాయంటున్న ఏ అధికారి వద్దా పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్న దాఖలాలు లేవని చెప్పారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన 20 ఎకరాల భూమి సంస్థకు లేదని తెలిపారు. సుమారు 1200 పశువులను ఉంచే స్థలం విడిగా ఉండాలని, కేవలం సంస్థ నిర్వహిస్తున్న ప్రాంతం 3.29 ఎకరాలు మాత్రమేనన్నారు. అక్కడ జరుగుతున్న రక్తపాతం కారణంగా నేల, నీరు, గాలి కూడా కలుషితం అవుతుందని, బ్యాక్టీరియా వ్యాపించే ప్రమాదం కూడా పొంచి ఉందని.. ఆ ప్రాంతవాసులకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు సమాధానం చెబుతారని నిలదీశారు.



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

బీజేపీ, జనసేన నాయకులు ఏం చేస్తున్నారు

బీజేపీ, జనసేన నాయకులు ఈ పశువధ చూసి కూడా ఏం చేస్తున్నారని కారుమూరి ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ స్పందించాలని, కాకినాడలో పశువధ శాలపై విచారణకు ఆదేశాలు జారీ చేసినట్టే ఇక్కడ కూడా విచారణ వేయించాలని కోరారు. పోలీసు వ్యవస్థ పశువధ శాలకు కాపలాగా ఉంటూ వారి కార్యకలాపాలకు అండగా నిలబడుతున్నారని కారుమూరి విమర్శించారు. పోలీస్‌ యాక్ట్‌, 144 సెక్షన్లను పశువధ శాలను నడిపించేందుకు ఉపయోగించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేకు బాధిత మహిళల రక్త కన్నీటికి సమాధానం చెప్పుకోవాల్సిన రోజు వస్తుందని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న సైన్స్‌ ఫెయిర్‌

వీరవాసరం: నైపుణ్యం ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం వీరవాసరం ఎమ్మార్కే జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్‌ ఫెయిర్‌ కార్యక్రమాన్ని రాష్ట్ర పబ్లిక్‌ అకౌంట్స్‌ కమిటీ చైర్మన్‌ పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌ ఫెయిర్‌ భవిష్యత్తుకు ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ సైన్స్‌ విద్య విద్యార్థుల్లో అంతర్గత శక్తులను వెలికితీస్తోందని, దీనికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ ఫెయిర్‌ విజేతలు : వ్యక్తిగత విభాగంలో ఆకివీడు ఉన్నత పాఠశాలకు కె.మణికంఠ, జల్లికొమ్మర మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఎస్‌.హనుమ, గ్రూప్‌ విభాగంలో జుత్తిగ జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థినులు కె.లక్ష్మీనాగ భవాని, కె.జాద్విక‌రెడ్డి, తణుకు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మహమ్మద్‌ ఫాజిల్‌, జహీరా, ఎస్‌.భార్గవి, ఉపాధ్యాయ విభాగంలో వైవీ లంకా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.రామాంజనేయరావు, ఆలమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కేఎస్‌ జోగిరెడ్డిలు ఎంపికయ్యారు.



సైన్స్‌ ఫెయిర్‌ తిలకిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, జేసీ రాహుల్‌ కుమార్‌ రెడ్డి తదితరులు

కొత్త ఏడాదిలోనూ షాక్‌



- సర్దుబాటు చార్జీలతో **రెండింతలైన** విద్యుత్‌ బిల్లులు
- చలికాలంలోనూ భారీగా కరెంటు **బిల్లులు**
- కూటమి సర్కారు **పాలనపై** ప్రజల ఆగ్రహం

నూజివీడు పట్టణంలో **సర్వీసు నెంబరు– 5637, డిసెంబర్‌ నెలలో 101 యూనిట్లు వాడగా** వాటికి చార్జీ రూ.400.. **ట్రూ అప్‌ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలతో కలిపి మరో రూ.471** అదనంగా వేశారు. ఇం**దులో ఏప్రిల్‌ 22, ఏప్రిల్‌ 23, నవంబరు 24 ఇంధన సర్దుబాటు చార్జీలంటూ** అదనపు భారం వేశారు. **దీంతో అసలు బిల్లు కంటే అదనపు బాదుడే ఎక్కువగా ఉంది.**



నూజివీడుకు చెందిన ఏ.నరేంద్ర అనే వ్యక్తి డిసెంబరులో 121 యూనిట్లు వాడగా దానికి సంబంధించి రూ.470 బిల్లు వచ్చింది. బాదుడు పేరుతో రూ.866 అదనంగా వేశారు. మొత్తం కలిపి రూ.1,336 బిల్లు వచ్చింది.

నూజివీడు: కూటమి పాలనలో విద్యుత్‌ బిల్లుల మోతతో జనం బెంబేలెత్తుతున్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే ప్రజలపై విద్యుత్‌ బిల్లుల భారం మోపారు. నూతన సంవత్సరంలోను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కరెంట్‌ షాక్‌ ఇచ్చింది. ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నెత్తిన మోయలేని భారాన్ని మోపడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్‌ బిల్లులు ఒక్క రూపాయి కూడా పెంచనని, అవసరమైతే తగ్గిస్తానంటూ ఎన్నికల ముందు బీరాలు పలికిన చంద్రబాబు నేడు వాటిని తుంగలో తొక్కి ప్రజల నెత్తిన భారీగా భారాన్ని మోపుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున భారాన్ని మోపుతుంటే ప్రశ్నించడానికే తాను పార్టీని పెట్టానంటూ చెప్పే పవన్‌కల్యాణ్‌ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆరు నెలలకే ప్రజలకు చుక్కలు

24 నెలల పాటు ఈ విద్యుత్‌ భారాన్ని మోపనున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల నెత్తిన రూ.15,485 కోట్లు మోపి బిల్లులు విపరీతంగా పెంచి వసూలు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మాట మార్చడంపై విద్యుత్‌ వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యుత్‌ వినియోగం ఎక్కువగా ఉంటే చార్జీలు ఎక్కువ ఉండాలి. తక్కువ విద్యుత్‌ వినియోగం ఉన్నప్పటికీ చంద్రబాబు పాలనలో విద్యుత్‌ బిల్లుల మోతమోగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా విద్యుత్‌ చార్జీల భారం పడిందని, తమను గెలిపిస్తే విద్యుత్‌ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని చంద్రబాబు నమ్మబలికారు. ఆరు నెలల్లోనే పేదలు, సామాన్యులు, వ్యాపారులు, పరిశ్రమలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల నెత్తిన భారం మోపి షాక్‌ ఇచ్చారు.

బిల్లు రూ.1300.. అదనపు బాదుడు రూ.800



విద్యుత్‌ బిల్లు రూ.1300 వస్తే ట్రూ అప్‌ చార్జీలు, మూడు నెలల ఇంధన సర్దుబాటు చార్జీలు కలిపి రూ.800 అదనంగా వేశారు. బిల్లు రూ.2100 వచ్చింది. చలికాలం ఫ్యాన్‌లు కూడా వేసుకోకపోయినా విద్యుత్‌ బిల్లు మాత్రం అధికంగా వస్తోంది.

– మల్లెల మోజేస్‌, నూజివీడు

మోత మోగుతున్నాయి



విద్యుత్‌ బిల్లులు మోత మోగిస్తున్నాయి. చలికాలం విద్యుత్‌ వాడకం తక్కువ ఉన్నా బిల్లులు మాత్రం తగ్గడం లేదు. విద్యుత్‌ బిల్లులే పెంచమని చెప్పి తీరా ఇష్టారాజ్యంగా బిల్లులు పెంచడం దారుణం. ఈ బిల్లులు ఎలా కట్టాలోనని ఆందోళన చెందుతున్నాం.

– కంచర్ల లవకుమార్‌, నూజివీడు

రాష్ట్రంలో మతోన్మాద ముప్పు



మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

భీమవరం: రాష్ట్రంలో మతోన్మాద ముప్పు పొంచి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సీపీఎం 26వ జిల్లా మహాసభలో రెండో రోజు ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ సిద్ధాంతాలను బీజేపీ తన భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలతో ప్రచారం చేయిస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీయే పాలనలో రాజకీయాలను కార్పొరేట్‌ శక్తులు శాసిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జమిలీ ఎన్నికల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదం మనుగడ సాగించలేవన్నారు. మహాసభల ప్రారంభ సూచకంగా సీపీఎం పతాకాన్ని పార్టీ సీనియర్‌ నాయకుడు కేతా సూర్యారావు ఎగురవేసారు. మహాసభలకు జుత్తుగ నాగ వెంకట గోపాలన్‌, చింతకాయల బాబూరావు, బురిడీ వాసుదేవరావు, కేతా గోపాలన్‌, దూసి కళ్యాణి అధ్యక్ష వర్గంగా వ్యవహరిస్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యమే జిల్లా సమగ్రాభివృద్ధికి శాపం

పాలకుల నిర్లక్ష్యం జిల్లా సమగ్రాభివృద్ధికి శాపంగా మారిందని మహాసభ ధ్వజమెత్తింది. జిల్లా సమగ్రాభివృద్ధికి పలు సూచనలు చేశారు. గోదావరి జలాలు, భూగర్భ జలాలు, సహజ సిద్ధ నిక్షేపాలు, పకృతి వనరులు పుష్కలంగా ఉన్నా మానవ వనరులను పాలకులు పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు పట్టణంలోని సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్, ఫిజికల్ డైరెక్టర్ దావూద్‌ఖాన్ తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు చత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలోని కోర్బాలో నిర్వహించే 68వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ అండర్ –19 పోటీలకు తమ విద్యార్థులు ఫణీంద్ర కుమార్, టి కేశవ మణికంఠ ఎంపికయ్యారన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 నెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం సాధించగా ఆ జట్టులో పాల్గొన్న తమ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శనివారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ అభినందించారు.

జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడిగా కృష్ణబాబు



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్ఆర్ కృష్ణబాబు ఎన్నికయ్యారు. శనివారం అమరావతిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్ఆర్ కృష్ణబాబు, ప్రధాన కార్యదర్శిగా కుమార్ నాయక్, కోశాధికారిగా మల్లెల సరోజమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీర్నాల కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా భూతిరాజు శ్రీనివాసరాజు, మరికొందరు సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ కృష్ణబాబు మాట్లాడుతూ నూతన కార్యవర్గంలోని సభ్యులు రాష్ట్రంలోని జానపద వృత్తి కళాకారుల అభ్యున్నతి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కృష్ణబాబుకు జంగారెడ్డిగూడెం పట్టణ ప్రముఖులు, పలువురు పెద్దలు అభినందనలు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం: పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని బలుసుమూడిలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారం టూటౌన్ సీఐ కాళీచరణ్‌కు రావడంతో శుక్రవారం రాత్రి ఆయన హెడ్‌కానిస్టేబుల్ గోవిందరాజులు, నరేష్, నాగేంద్రతో కలసి దాడి చేశారు. 8 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.లక్షా 12 వేల నగదు, నాలుగు మోటారు సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌డీ వైరస్‌తో కోళ్లు మృతి

- గాలి మార్పుల కారణంగానే ఆర్‌డీ వైరస్
- లక్షల్లో నష్టపోతున్న యజమానులు, వ్యాపారస్తులు
- సంక్రాంతి పందాలపై ప్రభావం



వైరస్ సోకి మృతి చెందిన కోళ్లు

దెందులూరు: కోళ్లు రెప్పపాటులో నీరసపడిపోతున్నాయి. చూస్తుండగానే మెడలు వాల్చి కిందపడి నిమిషాల వ్యవధిలోనే మృతి చెందుతున్నాయి. ఆర్‌డీ (రా చికెన్ డిసీస్) వైరస్ అనే అకాల వ్యాధి కారణంగా కోళ్లు మృతి చెందుతున్నాయని, గాలి మార్పుల కారణంగా ఈ వ్యాధి వస్తుందని, జాగ్రత్త వహించాలని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో బ్రాయిలర్, నాటు కోళ్లు మృతి చెందడం పట్ల వ్యాపారస్తులు, యజమానులు కలత చెందుతున్నారు. కోళ్ల పెంపకంపై వేలు, లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే.. ఇలా అకాల వైరస్ కారణంగా కోళ్లు మృతి చెందడాన్ని యజమానులు వ్యాపారస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. అనేక ప్రాంతాల్లో నాటు కోళ్లు, బ్రాయిలర్ కోళ్ల పెంపకంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఆధారపడి జీవిస్తున్నారు. కోళ్లు ఇలా మృతి చెందడంతో కోడిపందాల కోసం కోళ్లు పెంచుకుంటున్న యజమానులు, వ్యాపారస్తులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఆర్‌డీ వైరస్ ఈ ఏడాది తమ జీవనోపాధికి గండి కొట్టిందని వాపోతున్నారు.

సంక్రాంతి పందాలపై ప్రభావం

వైరస్‌తో కోళ్లు మృతి చెందడం సంక్రాంతి పందాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు అంటున్నారు. ఈ సమయంలో కోళ్లు చనిపోవడం వలన పందాలకు కోడి పుంజుల కొరత ఏర్పడుతుందనే పందెం రాయుళ్లు ఆందోళన చెందుతున్నారు. దీంతో సంక్రాంతి నాటికి పందెం పుంజుల సేకరణకు ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. ఇలా సేకరించిన పుంజుల కోసం జనావాసాలకు దూరంగా నివాసాలు ఏర్పాటు చేస్తున్నారు.



మృతి చెందిన కోడి శరీరంపై బొబ్బలు వచ్చిన దృశ్యం

తీవ్ర నష్టం



సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందాల కోసం ప్రత్యేకంగా పెంచుకునే కోడిపుంజు ధర రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు పలుకుతుంది. వీటిని ప్రత్యేక ఆహార నియమాలతో ఎంతో శ్రద్ధగా పెంచుతాము. ఈ సమయంలో మంచి పందెం పుంజులు చనిపోవడంతో పెంపకందారులకు, స్వయం ఉపాధి చేసుకుంటున్న వారికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

– గణేష్, కోళ్ల పెంపకందారుడు, దెందులూరు

జాగ్రత్తలు పాటించాలి



రా చికెన్ డిసీస్ (ఆర్‌డీ) వైరస్ వల్ల కోళ్లు మృతి చెందుతున్నాయి. గాలి ద్వారానే ఇలా జరుగుతుంది. దీని నివారణ కోసం మంచి గాలి, వెలుతురు, మంచినీరు ఏర్పాటు చేయాలి. ప్రతిరోజు కోళ్ల పెంపక ప్రాంతంలో బ్లీచింగ్ చల్లాలి. జబ్బు ఉన్న కోళ్లను ఇతర కోళ్ల నుంచి వేరుగా ఉంచాలి. చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పాతిపెట్టాలి. పశుసంవర్ధక శాఖ వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి.

– గోవిందరాజు, ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ ఏలూరు జిల్లా

శ్రీవారి సన్నిధిలో సినీ తారల సందడి



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సింగర్ సునీత, శ్రీవారిని దర్శించిన నటి రేణూ దేశాయ్

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో సినీ నేపథ్య గాయని సునీత, సినీ నటి రేణూ దేశాయ్ శనివారం సందడి చేశారు. వేర్వేరుగా ఆలయానికి విచ్చేసిన వారు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన సింగర్ సునీత ముందుగా ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. అలాగే నటి రేణుదేశాయ్ సాయంత్రం శ్రీవారిని, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకుని, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. గాయని సునీత, నటి రేణూ దేశాయ్‌లతో పలువురు భక్తులు, అభిమానులు ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

ఓవైపు పరీక్షలు.. మరోవైపు సినిమా షూటింగ్

- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు
- 40 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్న పత్రం



డీఎన్నార్ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



కళాశాలలో సినిమా షూటింగ్ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో దాసరి నారాయణ రావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓ వైపు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూనే.. మరో వైపు సినిమా చిత్రీకరణకు అనుమతి ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం పరీక్షలు జరిగాయి. కానీ అదే సమయంలో పేరు పెట్టని ఓ సినిమా షూటింగ్ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు పరీక్షలు రాయడం మానేసి షూటింగ్ వైపు చూస్తూ ఉండిపోవడం గుర్తించామని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎలా అనుమతి ఇస్తారంటూ మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా అని అధ్యాపకులు, కమిటీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

40 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రం

డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు గత నెల డిసెంబర్ 28న ప్రారంభంకాగా ఈనెల 9వ తేదీ వరకు జరగనున్నాయి. సబ్జెక్ట్‌ల వారీగా జరిగే పరీక్షలకు మూడు గంటల సమయం, స్కిల్ పరీక్షలకు రెండు గంటలు సమయం ఇస్తారు. శనివారం స్కిల్ పరీక్ష కావడంతో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రశ్న పత్రం 2.40 గంటలకు ఇచ్చినట్టు విద్యార్థులు తెలిపారు. తమకు 1.45 గంటలకు ప్రశ్నపత్రం ఆన్‌లైన్‌లో వస్తుందని కళాశాలకు చెందిన ఓ అధ్యాపకుడు తెలిపారు. తమ కళాశాలలో సుమారు 200 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, వారందరికీ నాలుగు పేజీల ప్రశ్నపత్రం ప్రింట్ తీసి ఇచ్చేసరికి ఇంత ఆలస్యమైందని ఆయన చెప్పారు. ఎంత ఆలస్యమైందో అంత సమయం కూడా విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

వైభవంగా శ్రీవారి తిరువీధి సేవ



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



శ్రీవారి ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో నామమాత్రంగా ఉన్న భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఉదయం జరిగిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్ర పర్వమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ స్వామి, అమ్మవార్లు, గోదాదేవి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం

శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైనరోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శిస్తారు. అయితే ఈ వారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. వచ్చే శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం, మరుసటి రోజు శనివారం కావడంతో అధిక శాతం మంది భక్తులు ఈ వారం క్షేత్ర సందర్శనను వాయిదా వేసుకున్నారు. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల ఇతర విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

టెక్‌జైట్–25 పోస్టర్ ఆవిష్కరణ



నూజివీడు ట్రిపుల్ ఐటీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య విజయ్‌కుమార్ తదితరులు

నూజివీడు: విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు సాంకేతిక సంబరం పేరుతో నిర్వహించే టెక్‌జైట్–25 కార్యక్రమం దోహదపడుతుందని ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం విజయ్‌కుమార్ అన్నారు. ఫిబ్రవరి 25 నుంచి 27వ తేదీ వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించనున్న టెక్‌జైట్–25 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం వైస్‌ఛాన్సలర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, వారి నైపుణ్యాలను పెంచుకోవడానికి టెక్‌ఫెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పలు రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లను, వివిధ కంపెనీలను సైతం ఆహ్వానిస్తున్నామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్, నూజివీడు ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ టెక్‌జైట్‌లో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీ, ఐఐటీ, ఇతర సాంకేతిక విశ్వవిద్యాలయాలకు ఆహ్వానాలను పంపనున్నట్లు తెలిపారు. ఈ టెక్‌ఫెస్ట్‌లో దాదాపు 5వేల మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి రూ.5 లక్షల విలువైన బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఏసీ కన్వీనర్ బీ జ్యోతీలాల్‌నాయక్, యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ డీన్ పీ శ్యామ్, డీన్ అకడమిక్స్ రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ నాగార్జునదేవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలాలపై ప్రత్యేక శ్రద్ధ

పెంటపాడు: మండలంలో జెడ్పీ స్థలాలను గుర్తించి అవి అన్యాక్రాంతం కాకుండా తక్షణం శ్రద్ధ పెట్టినట్లు జెడ్పీ సీఈవో కే సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండల ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రగతికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాడు వద్ద జెడ్పీ స్థలాలు గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ జెడ్పీ స్కూళ్లు, క్రీడా మైదానాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు వీటిని రెవెన్యూ ద్వారా గుర్తించాలన్నారు. ప్రహరీ గోడలు కట్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీడీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ గొప్ప ఆవిష్కర్త కావాలి



ఏపీ నిట్ ప్రాంగణంలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ప్రతి విద్యార్థి గొప్ప ఆవిష్కర్తగా తయారు కావాలని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయం, పెంటపాడులోని ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలల నుంచి మొత్తం 180 మంది విద్యార్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి పరిశోధకుడిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచే సరైన పునాది ఉండాలని చెప్పారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.విజయ్, ప్రేమలత, మనీషా, లక్ష్మీనారాయణ, ప్రసాద్, దిలీప్, సాయి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు టాలీ అనిత

ఏలూరు రూరల్: గుజరాత్ రాష్ట్రం భగ్దవర్‌లో జరిగే జాతీయ సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు క్రీడాకారిణి ఏ టాలీ అనిత ఎంపికైంది. ఈ నెల 5వ తేదీ నుంచి 12 వరకూ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. గత నెల మార్టేరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో చోటు సాధించింది. ఫలితంగా జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె మురళీకృష్ణ చెప్పారు.

లక్ష్మణేశ్వరంలో యువతి ఆత్మహత్య

నరసాపురం రూరల్: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం ప్రగతి నగర్‌కు చెందిన టంకాని లక్ష్మీకుమారి (20) శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పక్క గదిలో నిద్రిస్తున్న లక్ష్మీకుమారి చెల్లెలు దుర్గా భవాని విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్థానికులకు తెలియజేసింది. దీంతో లక్ష్మీకుమారిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిరస్త్రాణం...శిరసా నమామి

- హైకోర్టు ఆదేశాలతో కదిలిన పోలీసులు
- హెల్మెట్ అవశ్యకతపై స్పెషల్ డ్రైవ్

తాడేపల్లిగూడెం అర్బన్ :సమాజంలో జీవిస్తున్నప్పుడు భయంతో పాటు బాధ్యత కూడా ఉండాలని..అని ఓ రచయిత అన్నారు. ఎందుకంటే ద్విచక్ర వాహనాన్ని నడపటంలో వీరులమని హెల్మెట్ అవసరం లేదని కొందరకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. మరికొంత మంది శిరస్త్రాణాన్ని బరువుగా భావిస్తుంటారు. ఈ ఆలోచనే ప్రాణల మీదకు తెస్తోంది. హెల్మెట్ తప్పకుండా ధరించాల్సిందే అని హైకోర్టు ఆదేశాలతో శిరస్త్రాణం భారం కాదు..బాధ్యత అని పోలీసులు వాహనచోదకులకు, మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సత్వరమే జరిమానాలు విధించాలి, తనిఖీలు పెంచి కఠిన చర్యలు తప్పవనే సందేశం పంపాలి. రహదారులపై ముమ్మరంగా తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారికి అక్కడిక్కడే జరిమానాలు విధించాలి. అప్పుడు వాహనచోదకుల్లో భయం వస్తుందని హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో పోలీసుల్లో చలనం వస్తోంది. ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేస్తూ హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తున్నారు. పాత చలానాలు కటిస్తున్నారు.



తాడేపల్లిగూడెం పోలీస్ఐలాండ్ వద్ద హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు, విద్యార్థులకు హెల్మెట్ ధారణ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

ప్రమాద ఘటనలు అధికం

వాహనంతో రోడ్డెక్కితే భద్రంగా తిరిగి వస్తామనే నమ్మకం లేకుండా పోయింది. ర్యాష్ డ్రైవింగ్ సిగ్నల్స్‌ను జంప్ చేస్తూ అడ్డదిడ్డంగా అతివేగంగా వాహనచోదకులు వెళ్తున్నారు. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించడం, పాత జరిమానాలు కట్టించే దిశగా చర్యలు తీసుకుపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. రోడ్లపై మరణాలు హెల్మెట్ ధరించక ఎక్కువ మంది మరణించిన ఘటనలు ఉన్నాయి. వాహనాల తనిఖీని సీసీ కెమెరాల్లో చూసి జరిమానాలను విధించడంతో ఎక్కువ మంది చలానాలు కట్టడం లేదు. వాహన చోదకుల్లో భయం లేకుండా పోయింది.

వాహన తనిఖీలను ఉధృతం చేస్తాం



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మోటారు వాహన నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహన తనిఖీలు ముమ్మరం చేస్తాం. హెల్మెట్ ధరించాలి, రహదారి భద్రత–మనందరి బాధ్యత. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తాం. పాత చలానాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్ ధారణపైన వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ తగ్గించేందుకు వీలుగా తణుకు, భీమవరం వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నాం.

– ఎ. కొండలరావు, ట్రాఫిక్ ఎస్సై, తాడేపల్లిగూడెం.

వీటికి అడ్డుకట్టే వేయాల్సిందే

యువత హెల్మెట్ ధరించకుండా స్పోర్ట్స్ బైకులపై, అతి వేగంగా వెళ్తున్నారు. రాత్రి వేళ్లలో వీరికి అడ్డు అదుపూ లేకుండా పోతోంది. ర్యాష్ డ్రైవింగ్, ప్రమాదకర విన్యాసాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

వైఎస్సార్ సీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



తణుకులో వైఎస్సార్ సీపీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: నూతన సంవత్సరం తణుకు నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు తులతూగాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలపక్షాన పోరాటం చేసేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే పిలుపులకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, సీనియర్ న్యాయవాది సాయిబాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాధవరం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

తాడేపల్లిగూడెం రూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాధవరం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను శనివారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కే.సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, పంచాయతీ రాజ్ డీఈ యు.శ్రీనివాస్, ఏఈ శ్రీనివాసకుమార్, కూటమి నాయకులు గోపిశెట్టి భరతుడు ఉన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



మోడల్ టెస్టు పేపర్లను విద్యార్థులకు అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రతి విద్యార్థి పదోతరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించాలని దర్శిపర్రు గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి, ఉప సర్పంచ్ కోలా మార్కండేయులు పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీస్కూల్‌లో పదోతరగతిలో 42మంది విద్యార్థులకు యుటీఎఫ్ ద్వారా మెడల్ టెస్ట్‌పేపర్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ గతేడాది కన్నా ఈ ఏడు మరింతగా పదోతరగతిలో ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీస్కూలు హెచ్‌ఎం కేవీఎస్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం



మధ్యాహ్న భోజనం పథకంలో మాట్లాడుతున్న ఎంఈఓ జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించారు. ఎంఈఓ జ్యోతి, ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణలు మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారం అందజేసేందుకు, డ్రాపౌట్లను తగ్గించి, హాజరు శాతాన్ని పెంచేందుకు, చక్కని చదువులు చదివేందుకు మధ్యాహ్న భోజనం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, పట్నాల రాంపండు, వర్తనపల్లి కాశీ, గొర్రెల శ్రీధర్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులను ప్రయాణీకులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 9వ తేదీ గురువారం సాయంత్రం 7 గంటలకు తాడేపల్లిగూడెం డిపో నుంచి భద్రాచలంనకు స్పెషల్ బస్సు నడుపుచున్నట్లు తెలిపారు. 10వ తేదీన శుక్రవారం ఉదయం వాడపల్లి, ద్వారకా తిరుములకు స్పెషల్ బస్సులు నడుస్తాయని చెప్పారు. ప్రయాణీకులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదలకు ఆహార పదార్థాల వితరణ



తణుకులో ఆహార పదార్థాలను పేదలకు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తణుకులో నో ఫుడ్ వేస్ట్ కార్యక్రమం నిర్వహించారు. శుభకార్యక్రమాల్లో మిగిలిన ఆహారపదార్థాలను పేదలకు పంచినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కారుమంచి యోహాన్ అన్నారు. వివిధ కార్యక్రమాలో మిగిలిన ఆహార పదార్థాలను పేదలకు అందించి వారి ఆకలి తీర్చడమే నో ఫుడ్ వేస్ట్ కార్యక్రమ లక్ష్యమని అన్నారు. మిగిలిన ఆహారపదార్థాలను పారవేయకుండా మా సంస్థకు అప్పగిస్తే పేదలకు అందిస్తామని ఇందుకోసం 9182176611 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లిపూడి సన్నీ, దూలపల్లి సాగర్, తానేటి బన్ని, బన్ను, రాంచరణ్ పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శప్రాయం



ఇరగవరం : విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ) : విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బెయిలీ జీవితం ఆదర్శనీయమని ఇరగవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడలి సత్యనారాయణ, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పి.రేణుకలు తెలిపారు. శనివారం లూయిస్ బెయిలీ 197వ జయంతిని పురస్కరించుకుని బెయిలీ లిపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నేటి సమాజంలో అంధత్వాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తులు ఎందరో ఉన్నాయన్నారు. మనోధైర్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. వికలాంగులు సకలాంగులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రత్యేకావసరాల గల చిన్నారులను భవిత కేంద్రానికి క్రమం తప్పకుండా పంపితే వారు మానసిక, శారీరక వైకల్యాల నుంచి జయించి అన్ని రంగాల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ గాలేశ్వరరావు, కె.రామకృష్ణ, సుబ్బారావు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి సంబరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక 5వ వార్డులో భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భవిత విద్యార్థులకు లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్ర విశేషాలను వెల్లడించారు. విద్యార్థులకు ఇటీవల మ్యూజికల్ ఛైర్, పరుగు పందెం, క్యారం బోర్డు, స్కిప్పింగ్ డ్రాయింగ్, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్, బహుమతులు, స్వీట్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ అంధత్వంతో ఇబ్బందులు పడుతున్న పిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన జ్ఞాని యిస్ బ్రెయిలీఅని, బ్రెయిలీ లిపిలో పిల్లలు చదువుకొని అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. హెచ్‌ఎం బి.జ్యోతి, భవిత ఉపాధ్యాయుడు బాలీశ్వరయ్య, కుమారి, సత్యవతి, ఆంజనేయస్వామి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉండాలి

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



సమావేశంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

పెంటపాడు: ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో ఉండాలని, వాటిని సక్రమంగా నిర్వహించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం పెంటపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలు తమకు ఇచ్చిన అధికారంతో పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. ఈ సమావేశానికి 9శాఖల అధికారులతో పాటు ప్రధానంగా ముదునూరు వైద్యాధికారులు సమావేశానికి గైర్హజరు కావడంపై ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ప్రధానంగా డాక్టర్లపై ఉందన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీటవేస్తోందన్నారు. ఈ సమావేశం ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగిన సమావేశం ఆలస్యంగా కావడంతో ఎమ్మెల్సీ గంటన్నరుకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ జెడ్పీ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపేనే ఉందన్నారు. వాటిని గుర్తించి రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారం చూపాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో జగనన్న కాలనీలో మౌలిక వసతులు, గ్రామాల్లో డ్రెయినేజీలు అక్కడక్కడ రోడ్లు వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. పంచాయతీలకు జెడ్పీ నిధులు అందించే ఏర్పాటు చేయాలని జెడ్పీ సిఈఓను కోరారు. ఎంపీపీ దాసరి హైమావతి మాట్లాడుతూ అధికారులు పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో బాలాజీ వెంకట రమణ, జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సీతారత్నం, పలుశాఖల అధికారులు, ఎఓ పార్థసారధి, ఎంఈఓలు టీవీ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, టీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ చితూరు జిల్లా నగరి మండలం తడుకుపేట గ్రామంలో రోడ్డు విషయంలో దళితులపై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి, చెప్పులు నెత్తి మీద పెట్టుకొని నడవాలని, అసలు ఈ ఊర్లోనే ఉండొద్దని ఆంక్షలు విధించడాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. దళిత హోం మంత్రి ఉంటూ దళితులపై దాడులు జరుగుతుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దళితులకు రక్షణ కల్పిస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నియంత పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దళితులకు రక్షణ కల్పించకుంటే మాల సంఘాల జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో తడుకుపేట సందర్శిస్తామని, దళితులకు రక్షణగా నిలబడతామని చెప్పారు. పోరాటాలకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుంకంర సీతారాం, మానుకొండ శ్రీనుబాబు, కోట రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కడియద్ద గ్రామానికి చెందిన అచ్చయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామానికి చెందిన జలపతి అచ్చయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అచ్చయ్య మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, నాయకులు దారపురెడ్డి శ్రీనివాస్, యాతం చంద్రయ్య, జాలపర్తి కిట్టయ్య, సేవాదళ్ మండల అధ్యక్షుడు కొండుబోయిన కృపావరం తదితరులు ఉన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందజేయాలి



తణుకు అర్బన్: అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదిని కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు మంచి పోషకాహారాన్ని విధిగా తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఆశ, ఎం.అరుణకుమారి, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో ఈసీసీఈడే కార్యక్రమాలు.

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాలకు తమ చిన్నారులను పంపించడం ద్వారా వారిలో ఆరురకాల అభివృద్ధులు చెందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. శనివారం అత్తిలి మండలం గుమ్మంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలలో శారీరక, మానసిక, సాంఘిక, మేధాభివృద్ధి, భాషాభివృద్ధి, గణితాభివృద్ధి, సృజనాత్మకత అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో పీపీ–1, 2 కు సంబంధించి 5 రకాల చొప్పున వర్క్‌బుక్స్ అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి రాజకుమారి, సహాయకురాలు పి చిట్టిమరియ, ప్రీస్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు. తిరుపతిపురం శివారు శివపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమంలో భాగంగా పిల్లలు కూరగాయలు అమ్ముతుంటే తల్లులు కొనుగోలు చేసే సంఖ్యాజ్ఞానం కార్యక్రమం పిల్లలతో చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి మాధవి, సహాయకురాలు ఎస్ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఆరవల్లిలో పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి సంరక్షణ ఈసీసీఈ డే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. శనివారం అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈడే కార్యక్రమంపై చిన్నారుల పేరెంట్స్‌కు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అంగన్ వాడీ కేంద్రం చిన్నారులను ఆకర్షించే పలు రకాల బొమ్మలు, వస్తువులతో అలంకరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు గుబ్బల విజయవాణి, తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి : గుమ్మంపాడులో అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

కంచుమర్రులో....

ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌డే భాగంగా మంచిలి సెక్టార్ కంచుమర్రు గ్రామంలో ఈసీసీఈ డే నిర్వహించారు. ప్రీస్కూల్ ఆవశ్యతకను సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి తల్లిదండ్రులకు వివరించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతోనే మేలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం సెక్టార్ పరిధిలోని కోడ్ నెం.117 సెంటర్‌లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే విద్యావిషయాలను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు టీ.రాణి, ఎం.వెంకటరమణ, యు.వెంకటలక్ష్మి, ఇ.మంగతాయారు, ఎం.పద్మావతి, ఎం.సుజాత, ఆయాలు పాల్గొన్నారు. ఆరుగొలను–2, జగన్నాథపురం –4 అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవో టి.లక్ష్మీసరస్వతీ, సెక్టార్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యనాగలక్ష్మి, ఎ.తులసీ రాణి పాల్గొన్నారు. పెదతాడేపల్లి కోడ్ నెం.87, ఎల్.అగ్రహారం గ్రామాల్లో ఈసీసీఈ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, సునీత, రామలక్ష్మి, సుధ, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్ : జగన్నాథపురం-4 అంగన్ వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీసరస్వతి

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు



పెంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పెంటపాడు: గూడెం ఎక్సైజ్ పరిధిలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే రూ. 1.50 లక్షల జరిమానా విధించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటుతో పాటు, బెల్ట్‌షాపుల నిర్మూలన కోసం యువత ప్రత్యేకంగా కృషి చేయాలని గూడెం ఎక్సైజ్ సీఐ ఈ. స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెంటపాడు మండలంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 5 గురు ముద్దాయిలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో గూడెం ఎక్సైజ్ ఎస్ఐ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెంటపాడు: రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పలువురు వక్తలు తెలిపారు. మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం ఐసీడీఎస్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పిల్లల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పెంటపాడులో సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఉమామహేశ్వరంలో జీజీబీ విజయలక్ష్మి, సుజాతలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తణుకు అర్బన్: పట్టణంలో ది సిటీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ టేబుల్ క్యాలెండర్‌ను జాయింట్ కమిషనర్ పి.రామకోటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ డి రాంబాబులు ఆవిష్కరించినట్లు ఏలూరు డివిజన్ ప్రెసిడెంట్ పి.రాజేష్ బాబు తెలిపారు. శనివారం ఏలూరులో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు వివరించారు. ఏలూరు డివిజన్ కోశాధికారి బి.వెంకాలు బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో గోదావరి జలాలు అందిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని 22 గ్రామాలకు గోదావరి జలాలు పూర్తిస్థాయిలో అందిస్తామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కే.సుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని మాధవరం కోతిగుంట సీపీడబ్ల్యూ స్కీమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ స్కీమ్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌లు ముప్పిడి సూర్యకుమారి, ఆరుగొల్లు శ్రీనివాస్, సంసోను, డీఎల్‌పీవో బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సోమేశ్వరరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.